క్లుప్తంగా

'చర్య తీసుకోవాలి'

టేకుమట్ల: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరలకు మద్యాన్ని విక్రయిస్తున్న వైన్ షాపులపై చర్య తీసుకోవాలని సీపీఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి మారెపెల్లి మల్లేష్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని రెండు వైన్ షాపులు సిండికేట్‌గా ఏర్పడి ఒక షాప్ నుంచి రిటేల్, మరో షాప్ నుంచి బెల్ట్‌షాప్‌లకు అధిక ధరలకు మద్యాన్ని విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని మండిపడ్డారు. క్వార్టర్‌పై రూ.20, బీర్‌పై రూ.20లను అధికంగా తీసుకుంటూ సామాన్య ప్రజలపై భారాన్ని మోపుతున్నారని మండిపడ్డారు. మండలంలో విచ్చలవిడిగా బెల్ట్‌షాపుల నిర్వహణ కొనసాగుతున్న ఎక్సైజ్ అధికారులకు పట్టింపు లేకుండా ఉండడంపై అంతర్యమేంటని ప్రశ్నించారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి నిబంధనలకు విరుద్ధంగా కొనసాగిస్తున్న వైన్‌షాపులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, అధిక మద్యం ధరలకు నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట కసరవేని కుమార్ ఉన్నారు.

మంత్రిని కలిసిన ఎంపీటీసీ



కాటారం: రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును మంగళవారం హైదరాబాద్‌లో ధన్వాడ ఎంపీటీసీ దంపతులు బోడ మమత నరేశ్ మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రిగా బాధ్యతలు స్వీకరించడంపై హర్షం వ్యక్తం చేస్తూ శ్రీధర్‌బాబును శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. గ్రామంలోని పలు అభివృద్ధి అంశాల గురించి మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు ఎంపీటీసీ తెలిపారు.

ఆర్థిక సాయం



చిట్యాల: మండలంలోని చల్లగరిగ గ్రామానికి చెందిన చర్లపల్లి రాజు అనే ఇటీవల మృతి చెందాడు. మృతుడితో కలిసి 2001–02 సంవత్సరంలో చదువుకున్న పదవ తరగతి చెందిన తొటి మిత్రులు బాధిత కుటుంబానికి రూ.25వేలు ఆర్థిక సాయం అందించారు. మిత్రుడి కుటుంబానికి అండగా ఉంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మిత్రులు ఎరుకోండ రాజేందర్ గౌడ్, నోముల నాగరాజు, సుంకరి శ్రీనివాస్, చల్ల శ్రీనివాస్‌రెడ్డి, సదానందం, అశోక్, రాజు, సంతోష్, చిరంజీవి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ చట్టాలను అమలు చేయాలి



వెంకటాపురం(కె): ఆదివాసీ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని గోండ్వానా సంక్షేమ పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి కనితి వెంకటకృష్ణ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మట్టి రమేష్ అధ్యక్షతన గోండ్వానా సంక్షేమ పరిషత్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన చట్టాలను పటిష్టంగా అమలు చేసేందుకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆనందరావు, గోపాల్, బుచ్చన్న, సమ్మయ్య ఉన్నారు.

చేయూత

శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక గ్రామానికి చెందిన కోగిల ప్రమీల అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందగా మంగళవారం బాధిత కుటుంబ సభ్యులను ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ పరామర్శించారు. ఈ మేరకు రూ.2వేల ఆర్థిక సాయం అందించారు. రేణికుంట్ల శశాంక్, మంద సాంబయ్య, గోవిందు, వెంకటేష్, పవన్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

భూపాలపల్లి అర్బన్: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన భూపాలపల్లి–పరకాల జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. సీఐ రాంనర్సింహారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని రెడ్డికాలనీకి చెందిన తొటపల్లి అభిజిత్‌కుమార్ (20) రెడ్డికాలనీలో మగ్గం వర్కు చేస్తుంటాడని తెలిపారు. అతడి సొంత అవసర నిమిత్తం మంజూర్‌నగర్‌కు ద్విచక్ర వాహనంపై వెళ్లి భూపాలపల్లికి వస్తున్నాడు. ఈ క్రమంలో పట్టణ సమీపంలోని లారీ అసోసియేషన్ కార్యాలయం వైపు నుంచి వస్తున్న లారీని ద్విచక్ర వాహనం ఢీ కొట్టడంతో అభిజిత్‌కుమార్‌కు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

నిరుపయోగంగా బస్టాండ్!

- వినియోగంలోకి తేరు.. బస్సులు రావు
- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు



నిరుపయోగంగా ఉన్న నూతన బస్టాండ్

చిట్యాల: ప్రయాణికులతో కిటకిటలాడాల్సిన బస్టాండ్ బస్సులు రాకపోవడంతో నిరుపయోగంగా మారింది. బస్సులు రాకపోవడంతో పాటు సంబంధిత ఆర్టీసీ అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రయాణికులు కూర్చోవాల్సిన బస్టాండ్ ఎందుకు పనికి రాకుండా పోయింది. బస్టాండ్ నిరుపయోగంగా ఉండటంతో జమ్మికుంటకు వెళ్లాల్సిన ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డుపైనే నిల్చుని ఉండాల్సిన దుస్థితి నెలకొంది. గతంలో సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు అనేక మార్లు చెప్పిన కనీసం పట్టించుకునే వారే కరువయ్యారని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 2018లో అప్పటి ఆరుగురు రాష్ట్ర మంత్రులు వచ్చి ఎంతో ఆర్భాటంగా బస్టాండ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అదే క్రమంలో కొంత ఆలస్యమైన కూడా నిర్మాణం పూర్తి చేశారు. దాదాపు పూర్తయి రెండు సంవత్సరాలు గడిచిన ఇప్పటి వరకు కూడా ప్రారంభం చేయడంలేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్టాండ్ వృథాగా ఉండడంతో మందుబాబులకు అడ్డాగా మారింది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నూతనంగా నిర్మించిన బస్టాండ్‌ను ప్రారంభం చేసి ఉపయోగంలోకి తీసుకరావాలని పలువురు కోరుతున్నారు.

ఆటో డ్రైవర్లకు ఆర్థిక సాయం అందించాలి



పస్రాలో నిరసన తెలుపుతున్న ఆటో డ్రైవర్లు

గోవిందరావుపేట: ఆటో డ్రైవర్ల కుటుంబాలను ఆర్థిక సాయం అందించాలని ఆటో యూనియన్ జిల్లా ఇన్‌చార్జ్ త్రిపురరాని వెంకటేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. గోవిందరావుపేట మండల యూనియన్ అధ్యక్షుడు భూక్య రాజు ఆధ్వర్యంలో మంగళవారం పస్రా నుంచి గోవిందరావుపేట వరకు ఆటోల ర్యాలీ నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణం మహిళలకు వరం అయితే ఆటో డ్రైవర్లకు మాత్రం శాపంగా మారిందన్నారు. నిత్యం బస్సులలో ప్రయాణం చేసే వాళ్లలో ఎక్కువ మంది ఆడవాళ్లే అని అన్నారు. ఆడవాళ్లకి ఉచిత బస్సు ప్రయాణం పథకం అమలు చేయడంతో ఆటోలకు గిరాకి ఏమి లేక తమ బతుకులు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం ఆర్థిక వేతనం ఇవ్వాలని, ఆటోలకు ఇన్సురెన్స్, ఫిట్‌నెస్ ప్రభుత్వమే భరించాలి అని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి తమ బతుకుల గురించి ఆలోచించి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండలంలోని గ్రామాల ఆటో యూనియన్ అధ్యక్షులు ఏరువ మహేందర్, ఎండీ రహీం, కర్నాల నారాయణ, కొత్తపేట శ్రీరాములు, సాయిలు, శ్రీకాంత్, రిఖ్యా తదితరులు పాల్గొన్నారు.

కమిటీ ఎన్నిక



సమ్మయ్య, అధ్యక్షుడు



అశోక్, ప్రధాన కార్యదర్శి

టేకుమట్ల: మండలంలోని వెలిశాల ముదిరాజ్ సంఘం గ్రామ కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా సొసైటీ ఎన్నికల అధికారి దిలీప్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు కమిటీ వివరాలను వెల్లడించారు. అధ్యక్షుడిగా నరెడ్ల సమ్మయ్య, ప్రధాన కార్యదర్శిగా బండమీద అశోక్, ఉపాధ్యక్షుడిగా ఊటిపెల్లి కుమారస్వామి, డైరెక్టర్లుగా అందె ఓదెలు, నరెడ్ల పోశాలు, ఊటిపెల్లి శ్రీనివాస్, ఊటిపెట్టి ప్రశాంత్, అందె ఓదెలు, కలల సాయిలులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

మహిళా హక్కులుగా పరిగణించాలి



ధర్నాలో పాల్గొన్న మహిళలు

భూపాలపల్లిరూరల్: మానవ హక్కులే మహిళా హక్కులుగా పరిగణించాలని ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి రత్నమాల డిమాండ్ చేశారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం అంబేడ్కర్ సెంటర్లో ధర్నా చేసి అంబేడ్కర్ విగ్రహానికి మెమోరండం ఇచ్చి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రత్నమాల మాట్లాడుతూ.. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని నవంబర్ 25 నుంచి డిసెంబర్ 12 వరకు నిర్వహించాలని, సదస్సులు, సెమినార్లు, అంబేడ్కర్ విగ్రహాలకు మెమోరాండాలు ఇవ్వాలని ఐద్వా నిర్ణయించిన సందర్భంగా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. రాజ్యాంగం కల్పించిన హక్కులైనా మహిళా 33 శాతం రిజర్వేషన్లు నియోజకవర్గాల పునర్విభజన పేరిట మళ్లీ మూలన పడ్డాయన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన 6 గ్యారంటీలను మహిళా సంఘాలు ఆహ్వానిస్తున్నాయన్నారు. డ్వాక్రా మహిళలకు అభ్యాసం పెన్షన్లు, రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని, పేద ప్రజలందరికీ ఉచిత విద్య వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షురాలు వంగాల లక్ష్మి, జిల్లా కార్యదర్శి ప్రీతి, సహాయ కార్యదర్శులు రజిత, శ్రీదేవి, శ్రీలత, సునీత, శారద తదితరులు పాల్గొన్నారు.

శ్రీదేవిని కలిసిన వైద్యులు



శ్రీదేవికి పుష్పగుచ్ఛం అందిస్తున్న వైద్యులు

భూపాలపల్లి రూరల్: జిల్లా పశు, సంవర్ధకశాఖ అధికారిగా అదనపు బాధ్యతలు స్వీకరించిన శ్రీదేవిని జిల్లాలోని వివిధ మండలాల పశు వైద్యాధికారులు జిల్లా కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో భూపాలపల్లి మండల పశువైద్యాధికారి తిరుపతి, రేగొండ మండల వైద్యాధికారి మైథిలి, తదితర మండలాల వైద్యాధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని సమ్మె



ఆందోళన చేస్తున్న పోస్టల్ జీడీఎస్ ఉద్యోగులు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న తపాలా శాఖ ఉద్యోగులు

కాటారం: తమ సమస్యలు పరిష్కరించాలని ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్, నేషనల్ యూనియన్ ఆఫ్ గ్రామీణ డాక్ సేవక్ సంయుక్త ఆధ్వర్యంలో నిరవధిక సమ్మె చేపడుతున్నట్లు తపాలా శాఖ జీడీఎస్ ఉద్యోగులు తెలిపారు. మండల కేంద్రంలోని సబ్ పోస్టాఫీస్ ఎదుట మంగళవారం జీడీఎస్ ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం తమ డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని నినాదించారు. ఈ సందర్భంగా జీడీఎస్ ఉద్యోగులు మాట్లాడుతూ.. కొన్ని సంవత్సరాలుగా తమ గోడు వెల్లబోసుకుంటున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో సమ్మె చేస్తున్నట్లు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన ఇచ్చేంత వరకు సమ్మె విరమించేది లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐజీడీఎస్‌యూ సెక్రటరీ కుడుదుల కిష్టయ్య, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

తపాలా శాఖ ఉద్యోగుల నిరవధిక సమ్మె

గోవిందరావుపేట: గ్రామీణ తపాలా శాఖ నిరవధిక సమ్మెకు జేఏసీ పిలుపు మేరకు అందరు సిద్ధం కావాలని పస్రా తపాలా శాఖ ఉద్యోగస్తుడు వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రంలోని పస్రాలో సమ్మె పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాషా, నాగేశ్వరరావు, సందీప్, రాజుకుమార్, హరీష్, భాస్కర్, చిరంజీవి, రవి తదితరులు పాల్గొన్నారు.

ఓడబలిజ కులస్తులను ఆదుకోవాలి

కన్నాయిగూడెం: గోదావరిలో జాలరులుగా వేట సాగిస్తూ జీవనం సాగిస్తున్న ఓడబలిజలను ప్రభుత్వం ఆదుకోవాలని ఆ సంఘం మండల నాయకుడు సర్వేష్ అన్నారు. మంగళవారం మండలంలో ఓడ బలిజ సేవా సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ గెలుపులో ఓడబలిజలు ముఖ్య పాత్ర పోషించారని అన్నారు. ఓడబలిజాలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరా

ఏజెన్సీని వణికిస్తున్న చలి



ఉదయం 9 గంటలకు సూర్యుడిని కమ్మేసిన మంచు

మంగపేట: ఏజెన్సీలో నాలుగు రోజుల నుంచి రోజు రోజుకు చలితీవ్రత పెరుతుండటంతో ప్రజలు గజగజ వణుకుతున్నారు. సాయంత్రం 06 గంటల నుంచే చలి ప్రారంభమవుతోంది. ఉదయం 09 గంటల వరకు సూర్య భగవానుడిని మంచు తెరలు కమ్మేస్తున్నాయి. దీంతో 10 గంటల వరకు కూడా చలి తీవ్రత తగ్గడం లేదు. ఉదయం 09 గంటలు దాటినా పొగమంచు వీడటం లేదు. మంచు తీవ్రతకు లైట్లు వేసినా రోడ్డు కనిపించక పోవడంతో వాహనదారులు ముందుకు సాగేందుకు నానా తంటాలు పడుతున్నారు. చలికి తట్టుకోలేక చిన్నా పెద్ద చలి మంటలకు అతుక్కు పోతున్నారు. రోజువారి అవసరాలు, వ్యవసాయ కూలి పనులకు వెళ్లే రైతు, కూలీలు, చిరు వ్యాపారులు రగ్గులు, చలికోట్లు, స్వెట్టర్లు ధరించకుండా బయటకు వెళ్లలేక పోతున్నారు.



ఉదయం 8 గంటలకు రోడ్డుపై లైట్లు వేసుకుని వెళ్తున్న వాహనదారులు

రోడ్డు మరమ్మతులు మరిచారా?


- పత్తాలేని కాంట్రాక్టర్
- పట్టించుకోని అధికారులు, పాలకులు



గతుకులమయంగా ఏటూరునాగారం–బూర్గంపాడు ప్రధాన రోడ్డు

మంగపేట : మండలంలోని ఏటూరునాగారం–బూర్గంపాడు ప్రధాన రోడ్డు మరమ్మతులను ఆర్‌అండ్‌బీ అధికారులు మరిచారా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఏటూరునాగారం ఎన్‌హెచ్–163 నుంచి మండలంలోని జిల్లా సరిహద్దు వరకు గల 34 కిలోమీటర్ల రోడ్డు బీటీ రెనివల్ కోసం ప్రభుత్వం గతేడాది రూ.6.50 కోట్లు, ఈ ఏడాది రూ.3 కోట్లు మంజూరు చేసింది. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ మే నెలలో పనులు ప్రారంభించి మధ్యలోనే వదిలేశాడు. కాగా బోరునర్సాపురం వద్ద సుమారు 300 మీటర్ల మేర రోడ్డుపై బీటీని తొలగించారు. దీంతో రోడ్డుపై గతుకులు పడి ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి కిందపడటంతో పలువురు తీవ్రంగా గాయపడుతున్నారు. అయిన సంబంధిత కాంట్రాక్టర్ పట్టించుకోక పోవడం.. అధికారులు అటువైపు కన్నెత్తి చూడక పోవడంపై ప్రజలు మండిపడుతున్నారు. మంగపేట, కమలాపురం గ్రామాల మధ్య భారీ గుంతలు ఏర్పడి ప్రమాదాలకు నిలయంగా మారాయి. మూడేళ్లలో రూ.15 కోట్లతో రోడ్డు మరమ్మతులు, బీటీ రెనివల్ పనులు చేపట్టిన కొద్ది రోజులకే బీటీ లేచి గతుకులమయంగా మారాయి. సంబంధిత శాఖ ఉన్నతాధికారి బీటీ రెనివల్ పనులు పొందిన కాంట్రాక్టర్‌తో అంటకాగుతూ సహకరిస్తున్నాడనే ఆరోపణలున్నాయి. ఈ విషయంపై సంబంధిత అర్‌అండ్‌బీ డీఈ రఘువీర్‌ను వివరణ కోరగా కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం బిల్లులు చెల్లించక పోవడంతో పనులు నిలిచి పోయాయని రెండు, మూడు రోజుల్లో పనులు ప్రారంభించాలని అతనిని సూచించామని సమాధానమిచ్చారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి



మృతిచెందిన ఆవు

మొగుళ్లపల్లి: విద్యుదాఘాతంతో ఆవు మృతి చెందిన సంఘటన మొగుళ్లపల్లి మండలం మొట్లపల్లి గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. మొట్లపల్లి గ్రామానికి చెందిన తోకల లక్ష్మయ్యకు చెందిన పాడి ఆవు మేత మేసుకుంటూ వెళ్తున్న క్రమంలో తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వైరు తగిలి షాక్ గురై అక్కడికక్కడే మృతిచెందింది. దాదాపు రూ.50 వేల విలువల గల ఆవు మృతి చెందడంతో పాలు అమ్ముకుంటూ జీవనోపాధిని కోల్పోయానని యాజమాని లక్ష్మయ్య ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలన్నారు.

మంత్రి సీతక్కకు శుభాకాంక్షల వెల్లువ



మంత్రి సీతక్కకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఆదివాసీ ఉద్యోగుల సంఘం, సాంస్కృతిక సంఘం సభ్యులు



సీతక్కకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ముంజాల భిక్షపతిగౌడ్

ములుగు: మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ధనసరి సీతక్కను ఆదివాసీ ఉద్యోగుల సంఘం, సాంస్కృతిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు డీఎంహెచ్ఓ అల్లెం అప్పయ్య ఆధ్వర్యంలో ఉద్యోగులు హైదరాబాద్‌లోని ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ప్రజా సంఘాల జేఏసీ అధ్యక్షుడు ముంజాల భిక్షపతిగౌడ్, ములుగు మండలం జిల్లా అధికార ప్రతినిధి, కాశిందేవిపేట సర్పంచ్ అహ్మద్‌పాషాలు వేరువేరుగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఫిబ్రవరిలో జరగనున్న మేడారం మహా జాతరకు అధిక నిధులు కేటాయించి భక్తులకు తగిన ఏర్పాట్లు చేపట్టాలని అహ్మద్ పాషా కోరారు. ఆదివాసీ గిరిజన గ్రామం అయిన జగ్గన్నగూడేన్ని గ్రామ పంచాయతీగా గుర్తించాలని, జిల్లాను సమ్మక్క–సారలమ్మ జిల్లాగా నామకరణం చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని ముంజాల భిక్షపతి గౌడ్ కోరారు. ఆదివాసీ ఉద్యోగులు, సాంస్కృతిక సంఘం అధ్యక్షుడు మంకిడి రవి, సీపీఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు అన్నవరం రవికాంత్, ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సోలం కృష్ణయ్య, వాసం నారాయణ , ఈక కుమార్, రాజన్న, నాలి సాంబయ్య, సంపత్, ఈక కృష్ణ, కుమార్, తిరుపతయ్య, మారన్న, తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలతోనే బిడ్డకు ఆరోగ్యం



అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శిస్తున్న సీడీపీఓ అవంతి

చిట్యాల: తల్లిపాలతోనే బిడ్డలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని సీడీపీఓ అవంతి అన్నారు. మంగళవారం మండలంలోని తిర్మలాపూర్ గ్రామంలోని ఒకటవ, రెండవ అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె ఆకస్మికంగా సందర్శించారు. అనంతరం గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన ఆహారపు అలవాట్లపై వివరించారు. ప్రతి రోజు అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చి భోజనం చేయాలని అన్నారు. ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలే బిడ్డకు పట్టించాలని తెలిపారు. గ్రామంలోని 3 సంవత్సరాల నుంచి 6 సంవత్సరాల వయస్సు గల పిల్లలందరిని అంగన్‌వాడీ కేంద్రానికి పంపించాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఎల్‌కేజీ, యూకేజీకి సంబంధించిన బుక్స్ ఉన్నాయని తెలిపారు. అనంతరం బాలింతలు, పిల్లల ఎత్తు, బరువును రికార్డు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జయప్రద, టీచర్లు కవిత, త్రివేణి, రమణమ్మతో పాటు తదితరులు పాల్గొన్నారు.

బీపీ, షుగర్ పరీక్షలు చేసుకోవాలి



పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఏటూరునాగారం: 50 ఏళ్ల పైబడిన వారు విధిగా బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకోవాలని ఏఎన్ఎం గీత అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని 3వ వార్డులో 50 ఏళ్ల పైబడిన వారికి బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. అనంతరం గీత మాట్లాడుతూ.. బీపీ, షుగర్ ఉన్న వారికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇవ్వనున్నట్లు తెలిపారు. 40 సంవత్సరాల నుంచి జీవనంలో మార్పు వస్తుందని, వారి ఆరోగ్య సమస్యలను గుర్తించి ముందస్తుగా పరీక్షలు చేయించుకోవడం మంచిదన్నారు. ప్రతీనెల కూడా పరీక్షలు చేసుకొని వారి ఆహారపు అలవాట్లను మార్చుకోవాలన్నారు. స్త్రీ, పురుషులు విధిగా వ్యాయామం చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు ఆరుణ, కాళిక ఉన్నారు.

ఘనంగా స్వరాజ్య స్థాపన వార్షికోత్సవం



శిలాఫలకానికి పూలు చల్లుతున్న నాయకులు

శాయంపేట : ధర్మసమాజ్ పార్టీ చీఫ్ డాక్టర్ విశారధన్ మహారాజ్ చేపట్టిన స్వరాజ్య స్థాపన పాదయాత్ర వార్షికోత్సవాన్ని మండల కేంద్రంలో ఆపార్టీ నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. శిలాఫలకానికి పూలు చల్లుతూ నినాదాలు చేశారు. గతేడాది డిసెంబర్ 12న యాత్ర మంగళవారంతో సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాల్యాల అమరేందర్, నాయకులు మధు, దేవేందర్, పవన్, ప్రశాంత్, సతీష్ మాట్లాడారు. కల్వకుర్తి పట్టణ కేంద్రంలో డాక్టర్ విశారధన్ మహారాజ్ చేపట్టిన పదివేల కిలోమీటర్ల స్వరాజ్య పాదయాత్ర తెలంగాణలో 93శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రజలకు రాజకీయ చైతన్యాన్ని కలిగిస్తూ 33 జిల్లాలు, 300 మండలాలు, 3000 గ్రామాల మీదుగా కొనసాగిందని గుర్తు చేశారు. గత ఏడాది ఇదే పాదయాత్ర మండల కేంద్రంలో కొనసాగిందని తెలిపారు. ఈ సందర్భంగా సంబురాలు చేసుకుంటున్నట్లు తెలిపారు.